

# నిరీక్షణ

కె. కనకవల్లి

"డాక్టర్ బాబూ" చదువుతున్న మెడికల్ జర్నల్ టేబుల్ మీద పడేసి తలెత్తి చూసాను. ఎదురుగా రామన్న నిలబడి ఉన్నాడు.

రామన్న పాల వ్యాపారం చేస్తాడు. అతనికి నాలుగు ఆవులు, నాలుగు గేదెలు వున్నాయి. వాటికి అంటు వ్యాధులు, ప్రమాదకరమైన వ్యాధులు రాకుండా టీకాలు వేయించడానికి, వాటికి జబ్బు చేసినా మందులిప్పించడానికి రామన్న నా దగ్గరకు వస్తుంటాడు. రామన్నను చూస్తే నాకెంతో గౌరవం. రామన్న ఎక్కువ చదువుకోలేదు. అయితేనేం చదువుకొన్న వారికి కూడా తెలియని యెన్నో విషయాలు తెలుసతనికి. పాడి పశువులపట్ల అతడు చూపే శ్రద్ధ, వాటి ఆరోగ్య పరిరక్షణకై అతడు తీసుకొనే చర్యలు, నా కతనిపట్ల అభిమానాన్ని కలుగజేసాయి.

"ఏమిటి రామన్నా ?"

"మా నల్లావు బాబూ, రెండు రోజుల నుండి అసలు గడ్డి ముట్టడంలేదు. మూలుగా పడుంది. కాస్త చూస్తారేమోనని తోలు కొచ్చాను"

ఆవును పరీక్షించి, మందిచ్చి, రామన్నకు భయపడాల్సినదేమీ లేదని చెప్పి పంపేసాను.

టైం చూసాను. పన్నెండు గంటలయింది. వాసు కాలేజీ నుంచి ఇంటికివచ్చి వుంటాడు. జ్యోతి యింకా కాలేజీ నుండి వచ్చిందో, రాలేదో? ఇవ్వాళ యేదో టెస్ట్ వుందని రాత్రంతా మేల్కొని చదివింది. ఎలా రాసిందో?

ఆలోచిస్తున్న నేను "డాక్టరు గారూ" అన్న పిలుపు విని తలెత్తి చూసాను.

ఎదురుగా 18 సం॥ల అమ్మాయి నిలబడి ఉంది. ఆ అమ్మాయి చేతిలో ఒక ప్లాస్టిక్ బుట్ట ఉంది. అందులో ఏవో గుడ్డలున్నాయి. నేనామ్మాయి వైపు ప్రశ్నార్థకంగా చూసాను.

ఆ అమ్మాయి, ఆ ప్లాస్టిక్ బుట్టలో నుండి, గుడ్డల మధ్య నుండి ఒక నల్లని పిల్లిని తీసి టేబుల్ మీద పడుకోబెట్టింది.

"ఈ పిల్లి ఎందుకో నడవలేకపోతోంది డాక్టర్! అసలు ఏమీ తినటంలేదు. అరవటం లేదు" చిన్న పిల్లలా అన్నది.

నాకెందుకో ఆమె మాటలు వింటుంటే నవ్వొచ్చింది. పద్ధతి కాదని ఆపుకొని, పిల్లి వైపు చూసాను.

నల్లపిల్లి. దానిమీద బూడిద రంగు

# కార్యసాధన...




# సంతృప్తి

అద్భుతమైన రుచి
దానికదే సాటి
**సిజర్స్**
ఎప్పుడూ
సంతృప్తినిస్తుంది

సిగరెట్ తాగడం ఆరోగ్యానికి హానికరం
CIGARETTE SMOKING IS INJURIOUS TO HEALTH

మచ్చలు చూడటానికి చాలా భయంకరంగా వుంది చీకటో దాన్ని చూస్తే పిల్లలేకాదు పెద్దలు కూడా దడుసుకొంటార్లు. 'ఇంత భయంకరమైన పిల్లిని కాకపోతే, కాస్త అందమైన పిల్లిని పెంచుకోకూడదు ఈ అమ్మాయి' అనిపించింది నాకు.

"మీ పెంపుడు పిల్లా యిది ?"

"కాదండి ఎక్కడినుండో వచ్చి మా యింట్లో పిల్లలు పెట్టింది. రెండు రోజుల నుండి ఇలా పడివుంది. ఎందుకో మరి?"

పిల్లిని పరీక్ష చేశాను. జంతువులకువచ్చే ఒక రకమైన పక్షవాతమది ఆ రోగమొచ్చిన జంతువులు సాధారణంగా బ్రతకవు. అపస్మారక స్థితిలో మూడు నాలుగు రోజులుండి చచ్చిపోతాయి. మందులిచ్చినా ఏమీ ప్రయోజనముండదు. ఆమాటే అన్నానా అమ్మాయితో

"అంటే ఈ పిల్లి బతకదంటారా? పాపం, దీని పిల్లలు! చాలా చిన్న పిల్లలండీ అవి" అందా అమ్మాయి, ఆమె కన్నుల్లో నీళ్ళని నీటి తెర మెదిలింది

ఆమెను పరీక్షగా చూసాను గుండ్రటి మొహం, పెద్ద కండ్లు, నల్లని నొక్కుల జుట్టు, చామనఛాయ, సన్నగా ఉంది నల్లని పూలున్న తెల్లని చీర, తెల్లని జాకెట్ ఆమెలో నన్ను విపరీతంగా ఆకర్షించినవి ఆమె కళ్ళు. ఆ కన్నుల్లో దయ,జాలి అవి 'ఆమె చాలా సున్నితమైన మనసుగల వ్యక్తి' అని వెల్లడి చేస్తున్నాయి.

పిల్లిచేత బలవంతంగా మందుతాగించాను "రేపు తీసుకొని రండి, చూస్తాను."

ఆమె తల ఊపి, పిల్లిని తీసుకొని వెళ్ళిపోయింది. నేను ఆమె వెళ్ళిన వైపే చూస్తుండిపోయాను.

ఎందుకో ఆ అమ్మాయి నా మనసును బలంగా ఆకర్షించింది ఎందుకో ఆమెనింకో సారి చూడాలనిపించింది ఆమె ఎవరు? నేనెవరు? ఏమిటి ఆమెకు, నాకు వున్న సంబంధం?నా మనసును నేనే మందలించాను

కళ్ళ ముందు నా జీవితం నిలిచింది.

* * *

నేను వెటర్నరీ డాక్టర్ కోర్స్ పూర్తిచేసి, ఉద్యోగంలో చేరిన అర్నెల్లకు నాన్న మరణించారు. అనాటి నుండి కుటుంబ భారమంతా నామీదే పడింది. పక్షవాతం వచ్చి అమ్మకు కాలు చెయ్యి పడిపోయాయి ఎన్ని వైద్యాలు చేయించినా ప్రయోజనం లేకపోయింది.

చెల్లెలు జ్యోతి కాలేజీలో బి ఏ చదువుతున్నది తమ్ముడు వాసు మూగవాడు 'డంబ్ అండ్ డెఫ్ స్కూల్'లో ఇంటర్ చదువుతున్నాడు.

అమ్మ, చెల్లి రోజూ, నన్ను పెళ్ళి చేసుకోమని పోరు పెడుతూ వుంటారు. జ్యోతి అమ్మ పనులన్నీ చేస్తుంది. ఇంట్లో పనులన్నీ చేసుకొని కాలేజికి వెళుతుంది. చాలా శ్రమ పడుతుంది. పాపం!

"నీవు త్వరగా పెండ్లి చేసుకోరా అన్నయ్యా, వదిన వస్తే నాకు కాస్త సాయంగా ఉంటుంది."

## ఏది ప్రస్తుతం?

నిజం నిప్పులాంటిదని
అందుకే నమ్మినోళ్ళంతా
పారిపోతున్నారు,
కాలిపోతున్నారు.
అబద్ధాన్ని ..
పూజించినోళ్ళంతా
వెలిగిపోతున్నారు,
పెరిగిపోతున్నారు
ఎప్పుడో ఏదో జరుగుతుంది!
అప్పటికి నమ్మినోళ్ళుంటారా ???

— మాధవరపు కృష్ణ

నిజమే. ఇంట్లో ఇంకో స్త్రీ ఉంటే దాని శ్రమ చాలవరకు తగ్గుతుంది కాని ఆ వచ్చేవ్యక్తి ఈ శ్రమను పంచుకొంటుందనే నమ్మక మున్నదా ?

మొదటి నుండి నాకు, నా కుటుంబం మీద అభిమాన మెక్కువ నాకే కాదు ప్రతివ్యక్తికీ ఉంటుందీ భావన. కాని అన్నా చెల్లెలు, తమ్ముడు వారి ప్రేమలు, అనురాగాలు మొదలైన భావాల్ని అమ్మ నాన్న చిన్నప్పటి నుండి ఎంతో జాగ్రత్తగా నూరిపోసారు అలాంటి నేను, రేపు నా భార్య నా వాళ్ళను నిర్లక్ష్యం చేస్తే సహించలేను.

ప్రతి వ్యక్తి కుటుంబంలో ఒక భాగం. అలాంటప్పుడు ఆ కుటుంబం పట్ల అతనికి కొన్ని బాధ్యతలున్నాయి. వాటిని నిర్వర్తించటం అతని కర్తవ్యం కాని ఈ నిజాన్ని ఈనాటి ఆడపిల్లలెవరూ అర్థం చేసుకొన్నట్టు నాకనిపించలేదు మా యింటి చుట్టుపక్కల వాతావరణాన్ని, నా స్నేహితుల సమస్యలనే పరిశీలించి నేను ఈ నిర్ణయానికి వచ్చాను. ఈనాటి ఆడపిల్లలకు కేవలం భర్త, అతని సంపాదన కావాలి. అతని తల్లిదండ్రులు, అక్కచెల్లెళ్ళు, అన్నదమ్ములు వద్దు! అతనిబరువు బాధ్యతల్లు వద్దు!దాదాపు ప్రతి ఆడపిల్లా ఇలాగే ప్రవర్తిస్తున్నది

అందుకే నేను పెండ్లి చేసుకోలేదు నన్ను చేసుకోబోయే వ్యక్తి నన్ను సంపూర్ణంగా అర్థం చేసుకోవాలి నా వాళ్ళను ఆదరణతో చూడాలి ఆ వ్యక్తికి కావాల్సింది అంద చందాలు కాదు, కులగోత్రాలు కాదు చల్లని మనసు. ఆపదలలో, బాధలలో ఉండేవారిని చూచి జాలిపడే కరుణార్ద్ర హృదయం ఇవి చాలు నాకు ఈ గుణాలున్న వ్యక్తికోసం అన్వేషిస్తున్నాను నేను

హఠాత్తుగా, ఆ అమ్మాయి కండ్ల ముందు నిలిచింది నీళ్ళతో నిండిన నల్లని పెద్ద కండ్లు నేను అన్వేషిస్తున్నది ఈమె కోసమేనేమో అనిపించింది నాకు బాధ పడుతున్న ఒక ప్రాణి పట్ల అపేక్ష, దయ, ఆమె చల్లని మనసును తెలియజేస్తున్నది ఈమె నా భార్య అయితే? నా మనసు పులకరించింది

ఇవే ఆలోచనలతో ఇంటికి చేరాను. ఆ రాత్రంతా ఇలాంటివే కలలు ఆమె నా తల్లికి సేవలు చేస్తున్నట్టు, నా చెల్లిని, తమ్ముడిని ప్రేమగా చూస్తున్నట్టు, నేను ఆమె చెల్లాయి పెండ్లి చేస్తున్నట్టు, రకరకాల కలలు.

పొద్దున నిద్ర లేవగానే నిశ్చయించుకొన్నాను, ఇవ్వాళ ఆమె రాగానే ఆమెను గురించిన వివరాలన్నీ అడగాలని

పనులన్నీ ముగించుకొని రోజుకంటే ముందుగా చేరాను హాస్పెటల్‌కి ఆ రోజంతా ఆమె వచ్చిన మార్గం వైపే చూస్తూ కూర్చొన్నాను ఆమెకోసం ఎదురుచూస్తూ. ఆమె రాలేదు.

మర్నాడు, ఆ తర్వాత...రోజులు నెలలుగా మారిపోయాయి ఆమెకోసం నిరీక్షించటం నా దినచర్యలో ఒక భాగమైపోయింది. కాని ఆమె రాలేదు.